## క్లుప్తంగా

### వెంగమాంబకు పల్లకిసేవ



**దుత్తలూరు:** నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో గురువారం పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేషాభిషేకాలు, చందనాలంకారం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వెంగమాంబ–గురవయ్య దంపతులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. ఆలయ ఈఓ ఉషశ్రీ పాల్గొన్నారు.

### కారు బోల్తా

**సీతారామపురం:** మండలంలోని పోకలవారిపల్లి రోడ్డు సెంటర్ సమీపంలో గురువారం వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు.. సీతారామపురం నుంచి ఉదయగిరి వెళ్తున్న కారు డ్రైవర్ మద్యం మత్తులో అయ్యవారిపల్లి సమీపంలో హైవే పనులు చేపడుతున్న వారిని ఢీకొట్టబోయాడు. అదే క్రమంలో వేగంగా వెళ్తుండగా పోకలవారిపల్లి రోడ్డు వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారు దెబ్బతినగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

### వాటర్ కూలర్ వితరణ



**కలిగిరి:** తెల్లపాడులోని భద్రకాళి ఆలయానికి నూతక్కి వెంకట శేషాచారి జ్ఞాపకార్థంగా సతీమణి ప్రమీలారాణి మినీ వాటర్ కూలర్‌ను గురువారం అందజేశారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



**వరికుంటపాడు:** మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా జీ వేణుగోపాలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న మల్లికార్జున దుత్తలూరు ఈఓపీఆర్డీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మండల పరిషత్ ఏఓగా పనిచేస్తున్న వేణుగోపాలరావును ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ పూర్తి బాధ్యతలు అప్పగించారు. కాగా బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓను సచివాలయ సిబ్బంది సన్మానించారు.

**ఉదయగిరి:** మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా అప్పాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయగిరి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈశ్వరమ్మ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కలిగిరి మండల ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న అప్పాజీని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

### మర్యాదపూర్వకంగా..



**ఆత్మకూరు:** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని నివాసంలో కాకాణిని కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నోటి వినయ్‌కుమార్ రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ గోగుల బాలఅంకయ్య, గడ్డం శ్రీనివాసులరెడ్డి, కాశీరెడ్డి తదితరులు ఉన్నారు.

### గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**అల్లూరు:** గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రజనీకాంత్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గురువారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, ఆర్థిక నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ శశిరేఖ, అధికారులు పాల్గొన్నారు.

### 17న మండల పరిషత్ సాధారణ సమావేశం

**వింజమూరు(ఉదయగిరి):** మండల పరిషత్ సాధారణ సమావేశం ఈ నెల 17న జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. అభివృద్ధి పనులపై సమీక్షించడంతో పాటు నూతన పనులను ఆమోదించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

### ఉచిత కంటి వైద్యశిబిరం

**దుత్తలూరు:** రాచవారిపల్లిలో సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 9 మందికి కంటి శుక్లాలు, 52 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. శుక్లాలు ఉన్న వారిని శస్త్రచికిత్సలకు రెఫర్ చేయనున్నట్లు సీడ్స్ సిబ్బంది తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారికి అద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ నంబూరి వసంత, వైఎస్సార్‌సీపీ నాయకుడు నంబూరి రోశిరెడ్డి పాల్గొన్నారు.

# పశువైద్యం గగనం

**వేధిస్తున్న పశువైద్యుల కొరత**

- ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు
- ఇన్‌చార్జిలతో సక్రమంగా అందని వైద్యం
- ఆరు నెలలుగా మందుల సరఫరా నిల్
- పాడి రైతులకు తప్పని తిప్పలు



పాడి గేదెకు వైద్యం చేస్తున్న వైద్యసిబ్బంది

**ఉదయగిరి:** గ్రామీణ ప్రాంతాల్లో అధిక కుటుంబాలు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పశువులు, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశువైద్యం గగనంగా మారడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం పశువైద్యాన్ని చిన్నచూపు చూస్తోంది. కీలకమైన పశు వైద్యుల పోస్టులను భర్తీ చేయడం లేదు. పశువులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదు. వైద్యశాలల్లో కనీసం దూడలకు ఇచ్చే ఏలిక పాముల మందుకు కూడా దిక్కు లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పశు వైద్యులు సమయాన్ని పాటించడం లేదు. కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదనపు బాధ్యతలతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నామని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రాంతీయ వైద్యశాలలు నాలుగు, పశువైద్యశాలలు 15, గ్రామీణ వైద్యశాలలు మూడు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 70 శాతం కుటుంబాలు పాడి పశువులు, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పశువులు, జీవాలకు సీజనల్ వారీగా వివిధ రకాలు వ్యాధులు సోకుతుంటాయి. ఈ పరిస్థితుల్లో సక్రమైన వైద్యం అందక పశువులు, జీవాలు మృత్యువాతపడితే వాటి పెంపకందారులు తీవ్రంగా నష్టపోతారు. పశువైద్య సిబ్బంది, మందుల కొరతలతో పశు వైద్యం గగనంగా మారడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఇన్‌చార్జి వైద్యులే దిక్కు**

ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు, ఉదయగిరి, వింజమూరు, జలదంకి, సీతారామపురం మండలాల్లో వైద్యాధికారుల కొరత ఉంది. సీతారామపురం మండలం బసినేనిపల్లి, ఉదయగిరి మండలం గండిపాళెం, వింజమూరు మండలం చాకలకొండ, జలదంకి మండలం జలదంకి, బ్రాహ్మణకాక, దుత్తలూరు మండలం నర్రవాడ, నందిపాడులో రెగ్యులర్ వైద్యులు లేరు. అక్కడ సమీప వైద్యశాలల్లో పని చేసేవారిని ఇన్‌చార్జులుగా నియమించారు. దీంతో సక్రమంగా వైద్యసేవలు అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఆరు నెలలుగా మందుల సరఫరా నిల్**

పశువైద్యశాలలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి రెగ్యులర్‌గా మందులు సరఫరా చేసేవారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు డిసెంబరులో మందులు సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు మందులు సరఫరా చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో సీజనల్ వారీగా టీకాలతో పాటు 72 రకాల మందులను అందుబాటులో ఉంచేవారు. కానీ కూటమి ప్రభుత్వం కొలువు తీరి నాలుగు నెలలు కావస్తున్నా ఎలాంటి మందులు సరఫరా చేయలేదు. కనీసం దూడలకు ఇచ్చే ఏలికపాముల మందులకు కూడా దిక్కులేకపోవడంతో పశు పోషకులు వైద్యులు రాసే చీటీలు చేత పట్టుకుని ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

**ప్రైవేట్ మందుల షాప్‌కు వెళ్లాల్సిందే**



పశువులు, మేకలకు జబ్బు చేస్తే పశు వైద్యశాలల్లో మందులు ఇవ్వడం లేదు. వైద్యులు చీటీ రాసిస్తే ప్రైవేట్ మందుల షాపులకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో మాదిరిగానే కొత్త ప్రభుత్వం కూడా పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలి.
– దావీదు, ఉదయగిరి

**మందుల కొరత వాస్తమే**



పశువైద్యశాలలో మందుల కొరత తీవ్రంగా ఉంది. గత డిసెంబరులో మందులు సరఫరా చేశారు. ఆ తరువాత నుంచి సరఫరా చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలో మందులు వచ్చే అవకాశం ఉంది.
–కోటేశ్వరరావు, పశువైద్యులు, చాకలకొండ

## గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి



**జలదంకి:** అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో తాగునీటి సమస్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని పంచాయతీలకు సీసీ రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. అనంతరం అధికారులు శాఖల వారీగా జరిగిన అభివృద్ధిని చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, పీఆర్ ఏఈ వాణి, ఏఓ శైలజ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ శ్యామల, ఇరిగేషన్ ఏఈలు రామారావు, మాల్యాద్రి, డీటీ జూలీభాయ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## లింగ వివక్ష నేరం



**కావలి:** లింగ వివక్ష నేరమని, ఆడ, మగ బిడ్డలను సమానంగా చూడాలని రాజీవనగర్ పీహెచ్‌సీ వైద్యులు ద్వారకానాథ్, లక్ష్మి అన్నారు. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో పట్టణంలోని రాజీవ్‌నగర్ పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, భ్రూణహత్యలను నివారించాలన్నారు. అనంతరం డాక్టర్ రామ్ సెంటర్ సహకారంతో ఐరన్, పోలిక్ సిరప్‌లు, కాల్షియం, విటమిన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలకు దరఖాస్తు గడువు పెంపు

**సీతారామపురం:** విభిన్న ప్రతిభావంతులకు మంజూరు చేసే ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించిన దరఖాస్తు గడువును వచ్చే నెల 1వ తేదీ వరకు పొడిగించినట్లు మండల దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆదోని రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న దరఖాస్తు గడువు ముగియగా, సుదూర ప్రాంతాల దివ్యాంగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని గడువును పొడిగించాలని కోరడంతో కలెక్టర్ పెంచారని వివరించారు. ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**ఆత్మకూరు:** ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డివిజన్ పరిధిలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ క్రాస్ వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన రేడియం స్టిక్కర్లు కలిగిన ఇసుక డ్రమ్ములను సీఐ జీ గంగాధర్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి వైఎస్సార్ జిల్లా బద్వేల్ వరకు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు డ్రమ్ములు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టనున్నట్లు వివరించారు. ఎస్సైలు షేక్ జిలానీ, సాయిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రమ్ములను పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

## దుర్గాదేవి నమోస్తుతే

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం దుర్గాష్టమి సందర్భంగా ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం, జ్వాలాముఖి ఆలయం, సంగంలోని సంగమేశ్వరాలయంలో కామాక్షితాయి అమ్మవారు, వింజమూరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కలిగిరి మండలం తెల్లపాడులోని భద్రకాళి ఆలయం, సీతారామపురం మండలం సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరీదేవి, సీతారామపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, నారాయణప్పపేటలోని విజయకనకదుర్గాభవానీ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
–సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకారం

## సీసీరోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతి

**జలదంకి:** మండల కేంద్రమైన జలదంకి పంచాయతీ పరిధిలోని ఉత్తరం బజారు నుంచి సురె రమేష్‌రెడ్డి ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని ఆరో వార్డు సభ్యురాలు సురె వెంకట పద్మావతి కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ బ్రహ్మయ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 21న సర్పంచ్ అనూరాధ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఉత్తరం బజారు నుండి సురె రమేష్‌రెడ్డి ఇంటివరకు సీసీ రోడ్డు నిర్మాణానికి 13 మంది వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం ద్వారా ఆమోదించినట్లు ఆమె తెలిపారు. గత నెల 12న తీర్మానం కాపీని పీఆర్ ఏఈకు పంపగా రోడ్డు కొలతలు తీసుకుని పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చారని వివరించారు. అయితే కొందరు అధికార పార్టీ నాయకులు రోడ్డు పనులను అడ్డుకున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

## ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు



**కావలి:** డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా ప్రయాణికులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 మంది తమ సమస్యలు, అభ్యర్థనలు, సూచనలు, సలహాలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. అల్లూరులో బస్సు రాకపోకల సమయాల బోర్డు ఏర్పాటు చేయాలని, కొమ్మి హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా కొండాపురం బస్సు సమయాన్ని మార్చాలని, వేములపాడు బస్సును కృష్ణాపాడు వరకు పొడిగించాలని కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు. పామూరు, చాకలికొండ గ్రామాలకు సర్వీసులను కొత్త బస్సులు రాగానే నడిపేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఒక ఉపాధ్యాయుడు కర్నూలులో చదువుతున్న తమ పిల్లలకు అనుకూలంగా కావలి నుంచి కర్నూలుకు బస్సు సర్వీసు ఏర్పాటుకు విజ్ఞప్తి చేయగా, గత అనుభవాల దృష్ట్యా ప్రయాణికుల ఆదరణ లేనందున బస్సు సర్వీసు నడపలేమని తెలిపారు.

## మద్యం షాపుల దరఖాస్తుల్లో ఉదయగిరి వెనుకంజ



మాట్లాడుతున్న శ్రీనివాసులనాయుడు

**ఉదయగిరి:** జిల్లాలో మద్యం షాపులకు దరఖాస్తుల్లో ఉదయగిరి ఎక్సైజ్ సర్కిల్ బాగా వెనుకబడి ఉందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆలం శ్రీనివాసులనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఉదయగిరి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైనా మద్యం షాపునకు పది కంటే తక్కువగా దరఖాస్తులు వస్తే రీనోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. కాగా ఉదయగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఉదయగిరిలోని 3 షాపులకు 17, సీతారామపురంలోని 2 షాపులకు 17, దుత్తలూరులోని 2 షాపులకు 41, మర్రిపాడులోని 5 షాపులకు 40 దరఖాస్తులు చొప్పున మొత్తం 115 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ తన్నీరు లక్ష్మణ్‌స్వామి తెలిపారు.

**17 మద్యం షాపులకు 184 దరఖాస్తులు**

**కావలి:** కావలి ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో 17 మద్యం షాపులకు ఇప్పటి వరకు 184 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం ఆయన కావలిలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం వరకు దరఖాస్తు గడువు ఉందని చెప్పారు. ఈ నెల 14న షాపులకు లాటరీ తీయనున్నట్లు తెలిపారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారు తొలుత రూ.10.85 లక్షలు చెల్లిస్తే లైసెన్స్ మంజూరు చేస్తామని తెలిపారు. కావలి పట్టణం, మండలంలోని మద్యం షాపులకు ఏడాదికి రూ.65 లక్షలు, జలదంకి, బోగోలు మండలంలోని షాపులకు రూ.55 లక్షల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

## ప్రొఫెసర్ రామిరెడ్డికి సన్మానం



**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరుకు చెందిన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ యల్లాల వెంకటరమణారెడ్డి ఇటీవల భోపాల్‌లో జరిగిన సదస్సులో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైవీరెడ్డిని ఆపస్ వింజమూరు శాఖ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఏపీలో విద్యరంగంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తామని తెలిపారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఏపీలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను జాతీయ సదస్సులో చర్చించామని తెలిపారు. ఆపస్ నాయకులు పీ వెంగయ్య, కందుల మధు, ఎం ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, చలమయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ పరిశీలన



**సోమశిల:** అనంతసాగరం మండలం పడమటికంభంపాడులోని ఇసుకరీచ్‌ను ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని గురువారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక రీచ్ వద్ద ఇసుక డంపింగ్‌కు స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ వీర వసంతరావు, సర్వేయర్ విజయ్, వీఆర్వో అశోక్ ఉన్నారు.

## టాటా మరణం తీరనిలోటు

**ఆత్మకూరు:** భారతదేశ వ్యాపార దిగ్గజం, టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్‌టాటా మరణం దేశానికి తీరనిలోటు అని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. టాటా మరణంపై గురువారం ఒక ప్రకటనలో ఆయన సంతాపం తెలిపారు. జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని, పారిశ్రామికవేత్తగా ఉద్యోగాల కల్పనకు ఎనలేని కృషి చేశారన్నారు. నాయకత్వం, దాతృత్వంలో చెరగని ముద్ర వేసిన ఆయన జ్ఞాపకాలు మనతో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని పేర్కొన్నారు.

## పరామర్శ



మద్దూరు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేకపాటి

**వింజమూరు(ఉదయగిరి)/కలిగిరి:** వింజమూరుకు చెందిన మద్దూరు పెదకేశవరెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో భార్య రత్తమ్మ, కుమారుడు, కోడలు చంద్రశేఖర్‌రెడ్డి, సరస్వతిని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి గురువారం పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డిని పరామర్శించారు. తెల్లపాడుకు చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ మార్లెళ్ల రమణారెడ్డి ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులు కుమారుడు పద్మారెడ్డి, సర్పంచ్ దొరసానమ్మను పరామర్శించారు. పార్టీ నేతలు మద్దూరు చిన్నకృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, పల్లాల కొండారెడ్డి, చీమల హజరత్, ప్రసాద్‌రెడ్డి, ఏ నరసింహారెడ్డి, ఎం వెంకటరెడ్డి, కలిగిరి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, నాయకులు ఎం శ్రీనివాసులురెడ్డి, ఎం మధుసూదన్‌రెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.


